సాక్షి
ఏలూరు
ఆదివారం । 1 । జనవరి । 2023


ఏలూరులో అమ్మకానికి సిద్ధంగా డ్రైఫ్రూట్ గిఫ్ట్ ప్యాకెట్లు


ఆనందం వెల్లి'విరి'సేలా..

నవ వసంతం.. కావాలి మన సొంతం

సంబరాలు మిన్నంటే వేళ.. నింగి, నేల కాంతుల హేల..
మదినిండా మధుర స్మృతులతో 2022కు వీడ్కోలు.. కోటి ఆశలతో కొత్త వత్సరానికి స్వగతాలు.. ఉప్పొంగిన ఉత్సాహంతో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ..
అన్నీ మంచి శకునములే అనుకుంటున్న జిల్లా ప్రజలు.. గోదారమ్మకు మణిహారంలా పోలవరం ప్రాజెక్టు, నరసాపురం తీరంలో అభివృద్ధి పనులకు 2023 మైలురాయిగా నిలుస్తోందనే ఆకాంక్షలతో నవ వసంతం.. కావాలి మన సొంతం అంటూ ఏలూరు జిల్లావాసులు వేడుకలు జరుపుకుంటున్నారు.


ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో యువకుల వేడుకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆశలు, ఆశయాలను నిజం చేస్తూ తమను విజయపథాన నిలుపుతుందనే ఆకాంక్షలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. 2022కు గుడ్‌బై చెబుతూ.. 2023ను ఘనంగా ఆహ్వానించారు. శనివారం అర్ధరాత్రి వరకూ మహిళలు తమ ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దగా.. యువతీ, యువకులు స్నేహితులు, బంధువులతో కలిసి కేక్‌లు కట్ చేసి, బాణసంచా కాల్చి, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని సంబరాలు జరుపుకున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం వేళ రహదారులు కిటకిటలాడగా.. పండ్లు, పూలు, బ్యాకరీల వద్ద రద్దీ కనిపించింది. పూల దండలు, బొకేలు, కేక్‌లు, డ్రైఫ్రూట్ ప్యాకెట్లకు డిమాండ్ పెరిగింది. నగర, పట్టణ ప్రాంతాల్లో రెస్టారెంట్లు ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకున్నాయి.

ప్రాజెక్టులు పూర్తయితే అందలం : ఉమ్మడి జిల్లాలో అభివృద్ధికి ఆలవాలంగా నిలిచే ప్రాజెక్టులు కొత్త సంవత్సరంలో పూర్తవుతాయని ప్రజలు భావిస్తున్నారు. గోదావరికి వడ్డాణంగా, రాష్ట్రానికి జీవనాడిగా నిలిచే పోలవరం భారీ ప్రాజెక్టు పనులు దాదాపు 75 శాతం పూర్తయ్యాయి. కొత్త సంవత్సరంలో నూరుశాతం పనులు పూర్తయి సేవలందించాలని ప్రజల ప్రగాఢ వాంఛ. అలాగే నరసాపురం తీర ప్రాంతంలో ఇటీవల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేసిన రూ.3,300 కోట్ల ప్రాజెక్టుల పనులు కొత్త ఏడాదిలో పరుగులు పెట్టనున్నాయి. వీటిలో ముఖ్యంగా ఆక్వా యూనివర్సిటీ, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వంటి భారీ ప్రాజెక్టులు ఈ ప్రాంతాన్ని మరోస్థాయికి తీసుకువెళ్లనున్నాయి అలాగే నరసాపురం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన నరసాపురం–కోటిపల్లి రైల్వేలైన్ పనులు కూడా జరుగుతుండటంతో 2023లో ఈ కొత్తలైను అందుబాటులోకి వస్తుందనే ఆశ ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తంగా నూతన సంవత్సరం తమ జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.

హ్యాపీ న్యూ ఇయర్

- జిల్లా అభివృద్ధిపై గంపెడాశలు
- 2022కు ఘన వీడ్కోలు
- కోటి ఆశలతో 2023కు ఆహ్వానం

న్యూస్‌రీల్

ఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీఓ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అంతా టీమ్ వర్కుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించడంతో పాటు జిల్లాను ఆదర్శంగా నిలపవచ్చని కలెక్టర్ కోరారు. కొత్త సంవత్సరంలో మరింత బాగా పనిచేయాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు తదితరులకు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరనాథ్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ కె.నాగమణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, జిల్లా తాలూకా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం


జి.పాలరాజు, ఏలూరు రేంజ్ డీఐజీ

ఏలూరు టౌన్: పోలీసులు సామాజిక అంశాలపై అవగాహనతో ప్రజల శాంతియుతమైన జీవనానికి రక్షణగా నిలుస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు అన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల్లో పోలీసు యంత్రాంగం ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు సిద్ధంగా ఉండన్నారు. 2022లో నేరాలను నిరోధించడంలో సక్సెస్ అయ్యామన్నారు. 2023లో 2 వేల పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షణ పడేలా దర్యాప్తు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి డీఎస్పీ, సీఐ తమ పరిధిలో 5 కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటూ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసు అధికారులను హెచ్చరించారు. ఇప్పటికే 40 మంది పోలీస్ అధికారులపై దర్యాప్తు సాగుతోందని, రేంజ్ పరిధిలో 17 మంది సీఐ, ఎస్సైలను అవినీతి ఆరోపణలపై సస్పెండ్ చేశామని వివరించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అదే స్థాయిలో తమ వంతు కృషి, ప్రోత్సాహం ఉంటుందని డీఐజీ పాలరాజు అన్నారు.

శ్రీనివాసా.. గోవిందా


తొళక్క వాహనంపై ఊరేగింపు

ద్వారకాతిరుమల: ఉభయ దేవేరులతో చినవెంకన్న తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో శనివారం ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి జరిపిన ఈ ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేషంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవల నడుమ స్వామివారి గ్రామోత్సవం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

సప్తాహాల్లో సాంస్కృతిక శోభ


చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు జరిగాయి. విష్ణు సహస్రనామ పారాయణ చేసి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం 5 గంటలకు డాక్టర్ కృష్ణమూర్తి శ్రీరామ నామ వైశిష్ట్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం రామచంద్రపురానికి చెందిన గొర్రెల రాము బృందం వీరాభిమన్యు (పద్మవ్యూహం) అనే అంశంపై చేసిన బుర్రకథా కాలక్షేపం అలరించింది. రాత్రి 7.30 గంటల నుంచి నగరానికి చెందిన వెంకట్రాయ నాట్య బృందం ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పూజాదికాలు నిర్వహించగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంద్ర రవిశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సమష్టి కృషితో లక్ష్యాల సాధన : కలెక్టర్



ఏలూరు(మెట్రో): నూతన సంవత్సరంలో అందరి సమష్టి కృషితో కొత్త ఆశయాలతో లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభతరుణంలో ఆయన జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి సమన్వయం, కృషితో జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు కూడా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

● ముక్కోటి కాంతులు



ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం ముక్కోటి కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. శ్రీవారి గిరి ప్రదక్షిణ, ఉత్తర ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలు, రాజగోపురాలు విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతున్నాయి. ఆదివారం శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుక జరుగనుండగా సోమవారం వేకువజాము నుంచి చినవెంకన్న ఉత్తర ద్వార దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది. అలాగే నేటి సాయంత్రం నుంచి స్వామివారు నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - ద్వారకాతిరుమల

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి సాధించాలి


మాట్లాడుతున్న ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్ : తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట దిగుబడులను రైతులు సాధించేలా వ్యవసాయాధికారులు కృషి చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో తణుకు, పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాలకు చెందిన ఆర్‌బీకే ఇన్‌చార్జిలకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించేలా ఆర్‌బీకే ఇన్‌చార్జిలు చొరవ చూపి అధిక పెట్టుబడులను నివారించాలన్నారు. పొలంబడి ద్వారా వ్యవసాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఏడీఏలు పి.మురళీకృష్ణ, రమేష్, ఏఓ ఆర్‌ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో మౌలిక వసతులు

జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న కవురు శ్రీనివాస్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. శనివారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమ, సాంఘీక సంక్షేమ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో మౌలిక సదుపాయాల కోసం మంజూరు చేసిన రూ. 100 కోట్లతో చేపట్టిన పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయన్నారు. ఈ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత ప్రజాప్రతినిధులకు కచ్చితంగా తెలియజేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకం కింద అమలు చేసే అన్ని సంక్షేమ ఫలాలు కచ్చితంగా అందుతాయన్నారు. సమావేశంలో ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అందించడంతోపాటు పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులు జెడ్పీ చైర్మన్, ఆయా స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీ సభ్యులకు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పలు సమస్యలను ఈ సందర్భంగా స్థాయీ సంఘాల సభ్యులు జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ స్పందిస్తూ సభ్యులు సమావేశంలో తెలిపిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకతతో కూడిన పరిపాలన అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలన్నీ అమలు చేసి ప్రజలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఏలూరు జిల్లాలో కొత్తగా 9,500 మందికి పింఛన్లు మంజూరు చేశామని చెప్పారు. కొత్త పెన్షన్లు జనవరి 3న పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం పెన్షన్ పొందుతున్నవారికి జనవరి 2023 నుంచి రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన పెన్షన్‌ను యథాతథంగా జనవరి ఒకటో తేదీనే అందిస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏలూరు జిల్లాలో 1.17 కోట్ల పనిదినాలు కల్పించి, రూ.239 కోట్లను వేతనాలుగా కార్మికులకు అందించామన్నారు. మెటీరియల్ కాంపోండ్ కింద రూ.80 కోట్లు చెల్లింపులు జరిగాయని, మరో రూ.20 కోట్లు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇళ్ల లేఅవుట్లకు సంబంధించి ఇప్పటివరకు రూ.88 కోట్లు చెల్లించగా, మరో 10 రోజుల్లో రూ.22 కోట్లు విడుదల చేస్తామన్నారు. అమృత్ సరోవర్ కింద 127 చెరువులు అభివృద్ధి చేపట్టగా, ఇప్పటికే 45 పనులు పూర్తి చేశారన్నారు. ఈ స్థాయీ సంఘాల సమావేశాల్లో శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి, జెడ్పీ వైస్ చైర్మన్లు పోసిన శ్రీలేఖ, పి.విజయబాబు, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీపీఓ మల్లికార్జున, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పి.ఏసుదాసు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి మధుసూదనరావు, పశుసంవర్ధకశాఖ జేడీ జి.నెహ్రూబాబు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగేశ్వరరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, సాంఘీక సంక్షేమ శాఖ జేడీ మధుసూదనరావు, పౌర సరఫరాల సంస్థ జీఎం మంజుభార్గవి, డీఎస్‌ఓ సత్యనారాయణరాజు, డ్వామా పీడీ రాంబాబు, వివిధ శాఖలకు చెందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారులు, స్థాయీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలి

కొత్త సంవత్సరం 2023లో ప్రజలందరికీ మంచి జరగాలని, ఆరోగ్యంగా ఉండాలని, ఉమ్మడి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, జెడ్పీటీసీ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మరింత మెరుగైన సేవలు అందాలని ఆకాంక్షించారు.

సంక్షేమ సవ్వడి


తణుకు అర్బన్ : తణుకు 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


కైకలూరు (కలిదిండి) : కలిదిండి మండలం ఆవకూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

బ్రిడ్జ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: రాష్ట్రంలో డిప్లమో కోర్సు రెండో ఏడాదిలోకి నేరుగా ప్రవేశించాలనుకునే ఐటీఐ విద్యార్థులు జనవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 విద్యాసంవత్సరంలో డిప్లమో రెండో ఏడాదిలో నేరుగా చేరాలనుకునే ఐటీఐ విద్యార్థులు 60 శాతం మార్కులతో రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐకి నేరుగా వచ్చి వారి పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. బ్రిడ్జ్ కోర్సులో చేరాలనుకునే అభ్యర్థులకు ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి 9 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఫిజిక్స్, కెమిస్ట్రి, మాథ్స్ సబ్జెక్టుల్లో ఐటీఐలోనే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కనుక ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని శ్రీనివాసరాజు కోరారు.

కరాటే క్రీడాకారులను అభినందించిన మంత్రి


తణుకులో కరాటేలో సత్తాచాటిన క్రీడాకారులతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకే కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులను రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అభినందించారు. గత నెల 16 నుంచి 18 వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి బెనారస్ హిందూ యూనివర్శిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 7వ జాతీయ కరాటే పోటీల్లో అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి బంగారు, వెండి పతకాలు సాధించారు. దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి 1600 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో తమ విద్యార్థులు 50 మంది పాల్గొని ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని సొంతం చేసుకున్నట్లు కోచ్ కేతా శ్రీనివాస్ తెలిపారు. చిన్నవయస్సుల్లోనే విద్యార్థులను మార్షల్ ఆర్ట్స్‌లో తీర్చిదిద్దిన కోచ్ శ్రీనివాస్‌ను మంత్రి కారుమూరి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సుద్దుల పాండు, కొత్తపల్లి చరణ్, కారుమంచి యోహాన్, పాట్ల సురేష్ పాల్గొన్నారు.

'ప్రైవేట్' అఫిలియేషన్ ఫీజు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు 2022–23 సంవత్సరానికి గాను అఫిలియేషన్ ఫీజు చెల్లించడానికి ఈ నెల 4వ తేదీ వరకు గడువు తేదీని పొడిగించినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపు పునరుద్ధరణ కోసం ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి గుర్తింపు పునరుద్ధరణ ప్రక్రియను 130 కళాశాలలు పూర్తి చేశాయని, మరో 35 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంకా పూర్తి చేయాల్సి ఉందన్నారు. కాగా 18 జూనియర్ కళాశాలలు ఇంకా ఈ ప్రక్రియను ప్రారంభించలేదని, దరఖాస్తు గడువు ఇక ఎంతమాత్రమూ పొడిగించే అవకాశం లేదని, గడువు లోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

సండే క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

శ్రీవారికి స్వర్ణ పుష్పాలకు నగదు సమర్పణ



నగదు అందజేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి పూజల నిమిత్తం నగరానికి చెందిన నందిగం చిట్టిబాబు, బేబి కుటుంబం, ముళ్లపూడి శివకృష్ణ, సాయి మౌళిక కుటుంబం అష్టాదశ పాదపద్మ పుష్పాలు (ఏడు స్వర్ణ పుష్పాలు) నిమిత్తం నగదు సమర్పించారు. శనివారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ సమక్షంలో కార్యనిర్వహణాధికారి ఆంద్ర రవి శంకర్‌కు ఒక్కొక్క పుష్పానికి రూ.22,500 చొప్పున మొత్తం రూ.1,57,500 అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు, ట్రస్టీ చోడే శివసాయికృష్ణ పాల్గొన్నారు.

పెన్షన్‌పై వదంతులు నమ్మొద్దు

ఏలూరు (టూటౌన్) : ప్రజా సంకల్పం యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నూరుశాతం నెరవేర్చారని విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి పేర్కొన్నారు. పెన్షన్లన్నీ తీసేస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తోన్న దుష్ప్రచారాలు వాస్తవకం కాదని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆడిట్ చేస్తారని తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి రూ.2750 పెన్షన్ పెంచి తెల్లవారేసరికి ప్రతి లబ్ధిదారుకూ ఇంటి వద్దే ఇస్తారని వివరించారు. కులం మతం పార్టీ చూడకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అర్హులకు పెన్షన్లు తొలగించడం లేదని, అవ్వ, తాతలు, మహిళలు పెన్షన్లు రావనే ఆందోళనకు గురికా వద్దని పేర్కొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు జెడ్పీటీసీ సభ్యుల శుభాకాంక్షలు

పెదపాడు: జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసారు. జెడ్పీటీసీ సభ్యులంతా ఈ వేడుకల్లో పాల్గొని కవురు శ్రీనివాస్‌కు కేక్ తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ నూతన సంవత్సరం అంతా అందరికీ సుఖ శాంతులతో ఐశ్వర్యాభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్



ఏలూరు మార్కెట్‌లో రంగులు కొంటున్న మహిళలు



న్యూఇయర్ కేకులు కొంటున్న ప్రజలు

నూతనోత్సాహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో నూతన సంవత్సర సందడి ప్రారంభమయింది. శనివారం రాత్రి నుంచే నగరంలోని ప్రధాన రహదారులన్నీ జన సంద్రంగా మారాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు తమ ముంగిళ్లలో రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దడానికి రంగులు కొనుగోలు చేస్తూ కనిపించారు. శనివారం రాత్రి 12 గంటల వరకు విందు, వినోదాలు ఏర్పాటు చేసుకున్న వారి కోసం నగరంలోని పలు రెస్టారెంట్లు ఆఫర్లు ప్రకటించాయి. బిర్యానీలు, కూల్ డ్రింకులు ఒకటి కొంటో ఒకటి ఉచితం, ఫ్యామిలీ ప్యాక్ వంటి ఆఫర్లతో ఆకర్షించే ప్రయత్నం చేశాయి. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా తమ బంధుమిత్రులకు, ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలపడానికి వెళ్లే వారి కోసం పండ్లు, బొకెలు, పూల దండలు, డ్రైఫ్రూట్ ప్యాకెట్లు వంటివి మార్కెట్‌లో విరివిగా అందుబాటులోకి తెచ్చారు. వీటి ధరలు సాధారణ రోజులకంటే ఎక్కువగా ఉన్నాయనుకుంటూనే కొనుగోలు చేశారు.

జిల్లా కలెక్టర్‌కు ఫాదర్‌ల శుభాకాంక్షలు



జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పాలిమెర జయరావు, ఫాదర్‌లు

ఏలూరు(మెట్రో): నూతన సంవత్సరం సందర్భంగా ఏలూరు ఆర్‌సీఎం డయాసిస్, ఏలూరు పీఠం బిషప్ జయరావు పొలిమెర తరపున పలువురు ఫాదర్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సారథ్యంలో జిల్లా అభివృద్ధి పథంలో పయనించాలని వారు ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్‌ని కలిసిన వారిలో సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ ఫెలిక్స్, ఫాదర్ జాకబ్ ఉన్నారు.

నూతన సంవత్సర వేడుకల హంగామా



పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



భీమడోలు జంక్షన్‌లో ముంచెత్తిన బొకేలు, పూలదండలు

భీమడోలు: గ్రామాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. గ్రామాల్లో యువత ఉత్సాహంతో ఉవ్విళ్లూరుతున్నారు. 2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపేందుకు పలు రకాల బొకేలు, పూలదండలు, పండ్ల కొనుగోలుకు పలువురు దుకాణాలకు తరలిరావడంతో వాటి వద్ద రద్దీ నెలకొంది. పలు రకాల ఆఫర్లతో బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు హోరెత్తించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక తదితర గ్రామాల్లో బిర్యానీలను ఆఫర్ ధరలకు వినియోగదారులకు అందించారు. దీనితో దుకాణాలు జనంతో రద్దీగా మారాయి. చికెన్ బిర్యానీలతో పాటు వివిధ రకాల స్పెషల్ వంటకాలు ఘుమఘుమలాడాయి. శనివారం కావడంతో అమ్మకాలు మందగొండిగానే సాగాయని పలువురు బిర్యానీ వ్యాపారులు చెప్పారు. బొకేలు, పూలదండలు, కేక్ ధరలు ఆకాశన్నంటాయి. బొకేలు రూ.100 పైగా పలుకగా, పూలదండలు రూ.150పైగా, కేజీ కేక్ ధర రూ.200 పలికింది.

విద్యుత్ కాంతులతో నూతన శోభ

క్రైస్తవ దేవాలయాలు విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్నాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఒక్కరికీ మేలు జరగాలన్న సంకల్పంతో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. దేవాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రైస్తవ ఆలయాల్లో డిసెంబర్ నెలంతా విద్యుత్ దీపాలతో భారీ స్టార్స్‌ను ఏర్పాటు చేసారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, కొల్లేరు గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణ సైన్యం, పెంతెకోస్తు, బైబిల్ మిషన్‌లతో పాటు వివిధ సంఘాలకు చెందిన చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవ సోదరులు ఆలయాల్లో శనివారం రాత్రి కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా వేడుకలు

గణపవరం: నూతన సంవత్సర వేడుకలను పాఠశాలల్లో విద్యార్థులు ఒకరోజు ముందుగానే శనివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కొత్త సంవత్సరం 1వ తేదీన ఆదివారం పాఠశాలలకు సెలవు కావడంతో శనివారం సాయంత్రమే విద్యార్థులు కేకులు కోసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులను శుభ్రంచేసి రంగురంగుల రంగవల్లులతో తీర్చి దిద్దారు.

రైతుల మేలు కోసమే పథకాల అమలు



సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము

దెందులూరు: దళారీ వ్యవస్థ లేకుండా రైతుకు మేలు చేయాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో పలు పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత, కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము అన్నారు. సీఎం జగన్ ఆలోచన, ప్రణాళిక, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి సహకారం వల్ల నియోజకవర్గంలోని రైతులు సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. శనివారం కొవ్వలి సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో గ్రామానికి చెందిన 751 మంది రైతుల నుంచి 7,507 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ. 15,31,49,328 రావాల్సి ఉండగా కేవలం 21 రోజుల్లో రూ.15,06,97,248 జమ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని వ్యక్తిగా నిరూపించారన్నారు. కేవలం 38 మంది రైతులకు మాత్రమే నగదు వారి ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సహకారంతో జిల్లా అధికారులందరూ రైస్‌మిల్లర్లు పూర్తి సహకారాలు అందించారన్నారు. సమావేశంలో సర్పంచ్ ఇంటేటి మధులతా, పార్టీ అధ్యక్షుడు కాటి సుధాకర్, వైస్‌ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గోరిపర్తి వరలక్ష్మి రంగారావు, త్రీమెన్ కమిటీ డైరెక్టర్లు గొల్ల నాగభూషణం, అప్పన్న ఉన్నారు.

పూలదండలు, బొకేలకు దూరం

దెందులూరు: నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారందరూ పూలదండలు, బొకేలు, శాలువాలకు బదులుగా నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు దండలు, శాలువాలకు బదులు పుస్తకాలు, పెన్నులు ఇస్తే ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాభివృద్ధికి సహాయం చేసినవారు అవుతారన్నారు. ప్రతిఒక్కరూ ఈ విషయాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని ఆయన కోరారు.

అయ్యప్ప మాలధారుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందువుల విశ్వాసాలను దెబ్బతీసేలా.. అయ్యప్ప స్వాముల మనోభావాలకు విఘాతం కలిగేలా వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన బైరి నరేష్‌పై తక్షణమే పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్ట్ చేశాయాలని పలువురు అయ్యప్ప మాలధారులు డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణలో ఒక సభలో అయ్యప్ప స్వామి జననంపై మాలధారుల మనోభావాలు తెబ్బతినేలా విషపూరిత వ్యాఖ్యలు చేసిన నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నగరానికి చెందిన అయ్యప్ప మాలధారులు, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. నరేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో నరేష్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	10-12
బెండకాయలు	40	కంద	30
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	38
కాకర కాయలు	24-32	కీరా దోస	56
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	50	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30	పాలకూర	08
దొండకాయలు	40	చుక్కకూర	08
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణి	68
ఆనబకాయ (1)	25-20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-34

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



గోదారంగనాథస్వామికి సారెను సమర్పించిన భక్తులు

జంగారెడ్డిగూడెం : పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం శనివారం కావడంతో స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచి ధనుర్మాసం గోదామ్మవారి విశేషా ప్రవచనం, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదాగోష్టి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడుకు చెందిన భక్తులు, వికాసి తరంగిణి సభ్యులు శ్రీ గోదారంగనాదుడు స్వామి వారికి సారె సమర్పించారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు మాదాల రామమోహనారావు, దమయంతి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమారాచార్యులు పాశురాలను పఠించారు. కాగా సోమవారం ఉదయం 5 గంటలకు ఉత్తర ముఖంగా ద్వారదర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో పి.జగపతిరాజు, దండు దనరాజు, రెడ్డి రంగ ప్రసాద్, మాదల రామోహనారావు, కె.బాలకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

అటెండరు షేక్ పీరా హఠాన్మరణం

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో అటెండరుగా పనిచేస్తున్న షేక్ పీరా(53) గుండెపోటుతో మృతి చెందారు. శనివారం తహసీల్దారుతోపాటు గణపవరం వెళ్లి వస్తుండగా ఆకస్మికంగా ఛాతిలో నొప్పిరావడంతో వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పీరా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని ఉంగుటూరులోని తన నివాసానికి చేర్చారు. తహసీల్దార్ వెంకటరమణ, వీఆర్వోలు, ఆఫీసు సూపరింటెండెంటు పోతురాజు, కార్యాలయ ఉద్యోగులు, సర్పంచి బండారు సింధు మధుబాబు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ తదితరులు పీరా మృతదేహం వద్ద నివాళులర్పించారు. పీరామృతితో అతని భార్య నసీమ భేగమ్, కుమారుడు బొమ్మిడి సర్వేయర్‌గా పనిచేస్తున్న అజీజ్ నిశ , కుమార్తె జమాలుద్దీన్ కన్నీరుమున్నీరుగా విలపించారు. మట్టి ఖర్చులు నిమిత్తం రూ.25 వేలు అందజేస్తామని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర సహాయాలు పీరా కుటుంబానికి అందజేస్తామని తహసీల్దారు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని జెడ్పీ సీఈఓకు వినతి

కుకునూరు : మండలంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు జెడ్పీ సీఈవో రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశా రు. ఏలూరులో జరిగిన జిల్లా పరిషత్ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీలు గోదావరి వరదల వల్ల ముతబడిన ఆసుపత్రిని బాగు చేయాలని, మండలంలోని పాఠశాలల్లో టీచర్ల కొరతను పరిష్కరించాలని, గోదావరి వరదతో నీట మునిగిన ఇళ్లకు రూ.10 వేల నష్టపరిహారాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేయాలని, విద్యార్థులకు మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేయాలని, 45 కాంటూరు పరిధిలో రహదారులను బాగు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు.

ముప్పర్తిపాడులో ఫీవర్ సర్వే

గణపవరం: జ్వరాలతో సతమతమవుతున్న ముప్పర్తిపాడులో రెండోరోజు శనివారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి, వైద్యశిబిరం కొనసాగించారు.గ్రామంలో సూ పర్ శానిటేషన్ కార్యక్రమాలు నిర్వ హించారు. రోడ్ల పక్కనున్న చెత్తా, చెదారం తొలగించి బ్లీచింగ్ చల్లారు. క్రిమిసంహారక రసాయనాలను పిచికారీ చేయించారు. అన్ని వ్యాధులకు మూలం దోమలేని, అవి వృద్ధి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. డెంగీ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి సంతోషం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.శ్రీదివ్య, ఆరోగ్యసహాయకుడు నామాలరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	13
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	21

ప్రతి ఇల్లు సుఖ సంతోషాలతో వర్థిల్లాలి

భీమడోలు: నూతన సంవత్సరంలో ప్రతి ఇల్లు సుఖ సంతోషాల తో వర్థిల్లాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శనివారం రాత్రి పేర్కొన్నారు. గణపవరం కేవీపీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆయన పుట్టిన రోజు వేడుకకు హాజరైన వైసీపీ శ్రేణులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 1వ తేదీ ఆదివారం భువనపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలకు తాను అందుబాటులో ఉండడం లేదన్నారు. తిరుమల తిరుపతిలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం

బుట్టాయగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ప్లాస్టిక్ నిషేధంపై శనివారం స్థానిక సచివాలయ ఉద్యోగులు బుట్టాయగూడెంలో ప్రచారం నిర్వహించారు. సచివాలయ సెక్రటరీ తెల్లం సూరిబాబు ఆధ్వర్యంలో ప్రతి షాపునకు తిరుగుతూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ఈ నిషేధాన్ని ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని చెప్పారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

దెందులూరు: ఆ దేవుని చల్లని దీవెనలతో ఈ సంవత్సరం ప్రజలందరి ఆకాంక్షలు నెరవేరాలని దెందులూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం ప్రజలందరికీ ఆయురారోగ్యాలను, సుఖసంతోసాలను, భోగభాగ్యాలను ఆ భగవంతుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎమ్మెల్యే అన్నారు.

చర్చిలకు కేక్‌ల పంపిణీ

పెదపాడు: ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో పెదపాడు మండలంలోని అన్ని చర్చిలకు కేక్‌లను అందించారు. గ్రామాల్లోని చర్చిల్లో పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ కేక్‌లు పంపిణీ చేసారు. జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

టి.నరసాపురం : బాలికలు క్రీడలపై పెంచుకోవాలని మక్కినవారిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.ప్రసాద్ అన్నారు. శనివారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించారు. హెచ్ఎం ప్రసాద్ మాట్లాడుతూ జనవరి 11, 12, 13 తేదీల్లో విజయనగరం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల కబడ్డీ పోటీలకు పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని పి.ప్రశాంతి ఎన్నికైందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రశాంతి ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

తెలిపిన ఎంపీ కోటగిరి శ్రీధర్



దెందులూరు : జిల్లా ప్రజలంతా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. జిల్లా ప్రజలందరికీ 2023 సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలకు, సన్నిహితులకు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

బ్రహ్మకుమారీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఏలూరు (మెట్రో): ఎన్నో శతాబ్దాలుగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన జ్ఞాన, యోగా, ఆధ్యాత్మిక విలువలను సమాజానికి బ్రహ్మకుమారీస్ సంస్థ అందించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజయోగిని బీకే లావణ్య, బీకే మమత, బీకే రామబ్రహ్మం, బీకే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

కైకలూరు: ఆస్తి వివాదం కారణంగా ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయన కథనం ప్రకారం పెంచికలమర్రు గ్రామానికి చెందిన శారమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఘంటసాల ఇస్సాకు, కోడలు వరలక్ష్మీ ఇంటి అమ్మకం విషయంలో తనతో పాటు తన చిన్నకుమారుడు యోహోషువాపై ఘర్షణకు దిగారని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే ఘటనలో కోడలు వరలక్ష్మీ ఫిర్యాదుపై అత్త శారమ్మ, మరిది యోహోషువాపై కేసును నమోదు చేశారు.

రాహుల్‌దేవ్‌శర్మకు సీనియర్ ఎస్పీగా పదోన్నతి

ఏలూరు టౌన్: జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రాహుల్‌దేవ్ శర్మకు సీనియర్ ఐపీఎస్ అధికారిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అటు పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి విశేష కృషి చేస్తూనే మరోవైపు ప్రజలకు ఉత్తమ సేవలు అందించటంలో సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం ఆయన ఏలూరు జిల్లా ఎస్పీగా పనిచేస్తుండగా పదోన్నతిపై పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

భార్యాబిడ్డల అదృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : తన భార్య, బిడ్డలు కనిపించడం లేదంటూ అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్సై బులి స్వామి చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవాబుపాలెంలో గండ్రోతు కాశీవిశ్వనాథం, శాంతకుమారి భార్యాభర్తలు. వీరికి ఐదు, నాలుగేళ్ల గండ్రోతు విక్రమాదిత్య, నిత్య తులసి ఉన్నారు. కాశీవిశ్వనాథం ఇనుప వ్యాపారం చేస్తుంటాడు. కాశీవిశ్వనాథం వ్యాపారం నిమిత్తం ఒంగోలు వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి శాంతకుమారి, ఇద్దరు బిడ్డలు కనిపించడం లేదని ఫోన్ ద్వారా కాశీవిశ్వనాథంకు సమాచారం అందింది. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ కానరాకపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

సచివాలయ కార్యదర్శిపై టీడీపీ శ్రేణుల దాడి

పెదవేగి: పంచాయతీ కార్యాలయం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించాలన్న పాపానికి ఓ సచివాలయ కార్యదర్శిపై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ఆదేశాలతో టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెదవేగి సచివాలయ కార్యాలయం వద్ద స్థానిక టీడీపీ సర్పంచ్, మాజీ ఎమ్మెల్యే చింతమనేని, ఇతర నాయకులతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై కార్యదర్శి వరప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కార్యదర్శితో టీడీపీ నేతలు వాగ్వివాదానికి దిగి మాజీ ఎమ్మెల్యే చింతమనేనికి సమాచారం ఇవ్వగా, ఆయన సచివాలయానికి చేరుకున్నారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ వర్గీయులు కార్యదర్శిపై దాడి చేయడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. ఎస్సై ఎం.లక్ష్మణ్ ఘటనా స్థలానికి చేరుకుని కార్యదర్శిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులను సచివాలయం వద్ద మోహరించారు.



ఏలూరు నగరంలో నూతన సంవత్సరం సందర్భంగా కేకుల బేకరీ వద్ద సందడి





ఏలూరు నగరంలో ఓ బిర్యానీ దుకాణం వద్ద కొనుగోలుదారుల సందడి



బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన రంగుల దుకాణం

సందడే సందడి

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని జిల్లా అంతటా శనివారం సందడి వాతావరణం కనిపించింది. కొత్త ఆశలతో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ జిల్లా ప్రజలు ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. కేకులు, స్వీట్లు, రంగులు, ఫ్లవర్ బొకేలు, పండ్లు, పువ్వుల విక్రయానికి పలు ప్రాంతాల్లో రోడ్లపై తాత్కాలిక స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల వద్ద శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జనం రద్దీ కనిపించింది. పలు ప్రాంతాల్లో బిర్యానీ దుకాణాలు కూడా ఏర్పాటు చేశారు. అవి కూడా జనంతో రద్దీగా కనిపించాయి. ప్రధాన సెంటర్లలో జనం సందడి ఎక్కువగా కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్





నూతన సంవత్సరం సందర్భంగా ఏలూరు నగరంలోని ఓ స్వీట్ షాప్‌లో సందడి



నోరూరించే స్వీట్లు.. సంబరాలకు రెడీ



ఏలూరులో కేకుల తయారీలో నిమగ్నమైన కార్మికులు

తాగునీటి కోసం ప్రత్యేక నిధులు

- ప్రతి మండలానికి 300 నుంచి 500 మందికి కొత్త పెన్షన్లు
- కొత్త ఏడాది నుంచి రూ.250 పెంచి పెన్షన్ పంపిణీ
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కవురు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ఏలూరు (మెట్రో): జిల్లాలో తాగునీటికి సమస్య నివారణకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్య గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే, సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తానన్నారు. మండల ప్రజాప్రతినిధులు తమ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను తనకు తెలియజేస్తే వెంటనే పనులు మంజూరు చేస్తానన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పనులు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని, తెలంగాణకు చెందిన అధికారులు, ప్రజాప్రనిధుల బృందం జిల్లాలో మన బడి నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి కార్యక్రమాల అమలు పరిశీలించి, వారి రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని తెలియజేశారన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలోని ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. జెడ్పీటీసీ తెలిపిన సమస్యకు స్పందిస్తూ మండల స్థాయిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల సమాచారాన్ని స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లకు తప్పనిసరిగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెంచిన పెన్షన్లను జనవరి 1వ తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరసగా మూడో సంవత్సరం రూ.250 పెంచి రూ.2,750లను 2023 జనవరి 1వ తేదీ నుంచి లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరికీ పెన్షన్ తొలగించేది లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందిస్తామన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో 300 నుంచి 500 మంది వరకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి పెన్షన్ లబ్ధిదారుల సర్వే జరుగుతుందని, సర్వేలో ప్రభుత్వ నిబంధనల ననుసరించి ప్రభుత్వ ఉద్యోగం పొందిన, ఫోర్ వీలర్ కలిగినా, వెయ్యి చదరపు గజాల ఇళ్ల స్థలం కలిగి ఉన్నా, 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం కలిగినా, ఆదాయపు పన్ను పరిధిలోనికి వచ్చినా తదితర కారణాలు కలిగిన వారికి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, వారి నుండి సహేతుకమైన వివరణ అందించిన వారి దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగి ఉంటే పెన్షన్‌ను కొనసాగిస్తామన్నారు. నోటీసు ఇచ్చినంత మాత్రాన పెన్షన్ తొలగించినట్లు కాదని, జిల్లాలో ప్రస్తుతం 5 వేల మందికి పైగా నోటీసులు ఇవ్వగా, వారిలో కేవలం 1400 మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 20 ఎకరాలు ఉన్న వారికి సైతం పెన్షన్లు అందించి అవకతవకలకు పాల్పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పరిషత్ బడ్జెట్ రూ.139.31 కోట్లుగా సవరించామని, వ్యయం రూ.135.91 కోట్ల రూపాయలు కాగా, క్లోజింగ్ బ్యాలెన్స్ రూ.3.45 కోట్లు అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ అంచనా రూ.48.45 కోట్ల కాగా, వ్యయం రూ.47.04 కోట్లు చెప్పారు. అనంతరం సమావేశంలో విద్య, సాంఘిక సంక్షేమం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, సాంఘిక సంక్షేమం, తదితర శాఖల కార్యక్రమాలను సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కె.రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, విద్యా శాఖ జేడీ మధుసూదనరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర కానుకగా పెన్షన్ పెంపు

- జిల్లాలో 8,092 కొత్త పింఛన్ల మంజూరు
- డీఆర్‌డీఏ పీడీ విజయరాజు వెల్లడి



దివ్యాంగుడికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన పెన్షన్ కింద ఏలూరు జిల్లాలో 2,30,857 మంది వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లు గీత కార్మికులు, చర్మకారులు, ఒంటరి మహిళలకు ఈ నెల 1వ తేదీ నుంచి పింఛన్లు రూ.2,500 నుంచి రూ.2,750లకు పెంపుదల చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మిగిలిన పెన్షన్లతో కలిపి మొత్తం 2,73,866 మందికి రూ.75.89 కోట్లు 1వ తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాలో 8,092 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉదయం నుంచి వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన నిధులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు డ్రా చేశారన్నారు. ఆరు దశల్లో పరిశీలనలో భాగంగా జిల్లాలో మొత్తం 6,586 మందికి నోటీసులు జారీ చేయగా, వాటి పునః పరిశీలన అనంతరం వారిలో 4,533 మంది అర్హులుగా, 1,457 మంది అనర్హులుగా గుర్తించామన్నారు. ఇంకా 596 మంది వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మొత్తం పెన్షన్లలో కేవలం 0.5 శాతం మందిని అనర్హులుగా గుర్తించారన్నారు.

నియోజకవర్గాలవారీగా పెన్షన్ల పంపిణీ వివరాలు

చింతలపూడి నియోజకవర్గంలో 41,911 మందికి రూ.11.67 కోట్లు, దెందులూరులో 37,197 మందికి రూ.10.34 కోట్లు, ఏలూరులో 56,351 మందికి రూ.15.70 కోట్లు, గోపాలపురం నియోజకవర్గం, ద్వారకాతిరుమల మండలం కలిపి మొత్తం 9,831 మందికి రూ.2.74 కోట్లు, కైకలూరులో 35,025 మందికి రూ.9.62 కోట్లు, నూజివీడులో 41,985 మందికి 11.58 కోట్లు, పోలవరంలో 43.628 మందికి రూ.12.13 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 35,650 మందికి రూ.9.79 కోట్లు మొత్తం 2,73,886 మందికి రూ.75.89 కోట్ల సొమ్మును అందిస్తామన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ ఉద్యోగుల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

ఏలూరు (మెట్రో): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు చిత్తశుద్ధి, అంకితభావంతో సేవలందించాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శనివారం పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్ ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ప్రతి జెడ్పీటీసీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని, వాటితో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ముందుగా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శనివారం సాయంత్రం కేక్‌ను కట్ చేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి, జిల్లా పరిషత్ సీఈఓ కె.రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, విద్యా శాఖ జేడీ మధుసూదనరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రాధాన్యం

- మహిళల రక్షణలో రాజీపడబోం
- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ



ఏలూరు టౌన్: ×ఏలూరు జిల్లాలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించేలా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఉత్తమ సేవలే లక్ష్యంగా శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం. ప్రజలు పోలీస్‌స్టేషన్లకు స్వేచ్ఛగా వెళ్లి తమ బాధలు, సమస్యలు చెప్పుకుంటూ పరిష్కారం పొందే దిశగా నూతన విధానాలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ఏలూరు జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, అధికార యంత్రాంగానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు౯ అని ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన ×సాక్షి౯తో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత

జిల్లాలో మహిళల రక్షణకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నాం. మహిళలపై నేరాలను అదుపు చేసేందుకు, నిందితులకు శిక్షలు విధించేలా దర్యాప్తును వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దిశ యాప్ తోడు ఉంటే పోలీస్ వెంట ఉన్నట్లే అనే భరోసా కల్పించేందుకు పోలీస్ అధికారులు నిబద్ధతతో పనిచేసేలా ప్రణాళికతో పనిచేస్తున్నాం. పోక్సో కేసులు ఏడాదిలోపే శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటాం.

అసాంఘిక శక్తులకు చెక్ పెడతాం

సమాజంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ రౌడీయిజం, అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే ఉండదు. చట్టానికి లోబడి ప్రజలకు ఉత్తమ సేవలు అందించటమే ప్రధాన అజెండాగా సిబ్బంది పనిచేసేలా కృషి చేస్తున్నాం. జిల్లా ప్రజలకు అసౌకర్యం లేకుండా పోలీసు సేవలు ప్రజలకు చేరువ అయ్యేలా చర్యలు తీసుకుంటాం.



ఏలూరులో శానిటేషన్‌పై సూచనలు ఇస్తున్న జేసీ, ఇన్‌చార్జి కమిషనర్ అరుణ్‌బాబు

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించం

జేసీ, ఏలూరు ఇన్‌చార్జి కమిషనర్ అరుణ్‌బాబు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శానిటేషన్ నిర్వహణలో అలసత్వాన్ని సహించేదిలేదని జేసీ, ఏలూరు ఇన్‌చార్జి కమిషనర్ పీ.అరుణ్‌బాబు హెచ్చరించారు. శనివారం ఏలూరు సత్రంపాడు నుంచీ ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్యం తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటరీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదేననీ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. శానిటేషన్ సిబ్బంది దిని వారికి కేటాయించిన పాయింట్ల వద్ద సర్దుబాటు వేసి నిర్దేశిత సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా శానిటరీ సెక్రటరీలతో సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య సిబ్బంది, మేస్త్రిలు ఆయా ప్రాంతాల్లోని వ్యర్థాలు, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో టీటీడీ కల్యాణ మండపం నుంచి శాంతినగర్ పోలీస్‌పెట్రోల్ బంకు వరకూ అధునాతన ఫుట్‌పాత్ నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫుట్‌పాత్ నిర్మాణంతోపాటు కార్పెట్ గ్రాస్ వేసి మొక్కలు నాటాలని, ఫుట్‌పాత్ లైటింగ్, కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ బాపిరాజు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంఈ భాస్కరరావు, ఏసీపీ శాంతిలత, డీఈలు, ఏఈలు ఉన్నారు.

నిండుకుండలా తమ్మిలేరు జలాశయం

- పూర్తి సామర్థ్యం 355 అడుగులు.. ప్రస్తుతం 345.19 అడుగల మేర నీటి నిల్వలు
- కుడి కాలువ పరిధిలో 5 వేల ఎకరాల్లో రబీ సాగుకు నీటి విడుదలకు నిర్ణయం

చింతలపూడి: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు తమ్మిలేరు జలాశయం నిండుకుండను తలపిస్తూ జలకళను సంతరించుకుంది. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు జలాశయంలోకి పూర్తి స్థాయిలో నీరు చేరింది. రాష్ట్ర విభజనతో ఈ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిపై రెండు జిల్లాల రైతులు ఆశలు వదులుకున్నారు. గత ఏడాది, ఈ ఏడాది కూడా ఊహించని విధంగా అధిక వర్షాలతో జలాశయం నిండటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 345.19 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయం పూర్తి సామర్థ్యం 355 అడుగులు. ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 9,169 ఎకరాలు అధికారికంగా సాగు చేస్తున్నారు.

15 ఏటి కాలువల ద్వారా..

నలభై ఏళ్ల క్రితం తమ్మిలేరు ప్రాజెక్టు నిర్మించగా, రిజర్వాయరు ఎగువ భాగంలో 20 వేల ఎకరాలు, దిగువ భాగంలో ఏలూరు వెళ్లే కాల్వకు ఇరువైపులా 15 ఏటి కాలువల ద్వారా 14,200 ఎకరాలు అనధికారికంగా సాగవుతున్నాయి. జిల్లాలోని తలార్లపల్లి, యర్రంపల్లి, యడవల్లి, కల్యాణంపాడు, తువ్వ చెలక రాయుడుపాలెం, గ్రామాలకు చెందిన 475 ఎకరాల పల్లం భూములకు, 3,769 ఎకరాల మెరక భూములకు నీటి సరఫరా జరుగుతోంది. అదే విధంగా జిల్లాల పునర్విభజనతో ఏలూరు జిల్లాలో చేరిన పోలవరం, చాట్రాయి, తుమ్మగూడెం, మంకొల్లు, సోమవరం గ్రామాలలో 1,855 ఎకరాల పల్లం భూములకు, 3,070 ఎకరాల మెరక భూములకు సాగునీరు లభిస్తోంది.

కుడికాలువ కింద ఆయకట్టుకు నీరు..

ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమకాలువల ద్వారా 9,169 ఎకరాలకు సాగునీరు అందిస్తుండగా, ప్రస్తుతం ప్రాజెక్టుకు, ఎడమ కాలువలకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఎడమకాలువ పరిధిలో రైతులు ఈ రబీ సాగును స్వచ్ఛందంగా విరమించుకోగా, ఈ మేరకు మరమ్మతులు చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో కుడికాలువ కింద ఉన్న ఐదువేల ఎకరాలకు రబీ పంటకు సాగునీరును విడుదల చేయాలని రెండు నెలల క్రితం ఏలూరులో జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.


తమ్మిలేరు ప్రాజెక్టు నిండుకుండలా జలకళతో ఉట్టిపడుతున్న దృశ్యం


తమ్మిలేరు జలాశయం నుంచి ఆయకట్టుకు సాగు నీరు అందించే కుడి కాల్వ

రాష్ట్ర విభజన శాపం

రాష్ట్ర విభజనతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న అంధ్రాకాలువ ద్వారా తమ్మిలేరుకు వచ్చే వరద నీరు రాకుండా తెలంగాణ ప్రభుత్వం మళ్లించింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ఎత్తును పెంచి ఎన్‌టీఆర్ కాలువ ద్వారా ఖమ్మం జిల్లాలోని చెరువులకు నీటిని మళ్లించడంతో వరద నీటిపై ఆశలు గల్లంతయ్యాయి. ఓవర్ ఫ్లో వచ్చి అలుగు పారితేనేగాని వరద నీరు వచ్చే అవకాశం లేదు.

రబీకి నీటి కొరత లేదు

ప్రాజెక్టులో ఉన్న నీటి సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతుల అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇరిగేషన్ ఎస్‌ఈల ఆదేశాల మేరకు జిల్లా ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు మీటింగ్‌లో రబీలో సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రైతులు ఎప్పుడు కోరితే అప్పుడు రబీకి నీరు విడుదల చేస్తాం.

– బి.శ్రీనివాసరావు, డీఈ, తమ్మిలేరు ప్రాజెక్టు

అలరించిన కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు శనివారం ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం వివిధ దేవతామూర్తుల కీర్తనలను ఆలపిస్తూ కోలాట నృత్యాలు చేశారు. ఇదిలా ఉంటే ఉదయం క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. అయితే నూతన సంవత్సరం తొలిరోజు ఆదివారం స్వామివారిని దర్శించేందుకు పెద్ద ఎత్తున భక్తులు శనివారం సాయంత్రానికే ఆలయానికి చేరుకున్నారు. అందులో భాగంగా పినకడిమికి చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా క్షేత్రానికి విచ్చేశారు. నృత్య ప్రదర్శనలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో కోలాట నృత్యాలు చేస్తున్న భజన మండలి సభ్యులు

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు కె.కోట విద్యార్థి

కామవరపుకోట : జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కామవరపు కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కస్సె చరణ్‌తేజ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ప్రశాంత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు శ్రీసత్య సాయి జిల్లా కదిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో చరణ్‌తేజ విశేష ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని, త్వరలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటాడన్నారు. చరణ్‌తేజ, శిక్షణ ఇచ్చిన పీడీలు మానుకొండ సుబ్బారావు, తూంపాటి బాబురావులను హెచ్‌ఎం, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.


విద్యార్థి చరణ్‌తేజతో ఉపాధ్యాయులు

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా శ్రేయస్సే పరమావధిగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఏలూరు జిల్లా అభివృద్ధికి పాటుపడతామని, ఏలూరు నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపించటమే కర్తవ్యంగా భావిస్తామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు జిల్లాలోని ప్రజలు, అధికార యంత్రాంగం, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా 2023 సంవత్సరంలో సంతోషంగా జీవించాలని, సమస్యలను అధిగమిస్తూ విజయవంతమైన జీవితాన్ని భగవంతుడు జిల్లా ప్రజలకు ఇవ్వాలని ఆకాంక్షించారు.

ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఏలూరు నియోజకవర్గం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే నాని అన్నారు. మూడున్నరేళ్ల కాలంలో ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.200కోట్లకు పైగా అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాబోయే కాలంలో జిల్లాను ఆయనకు కానుకగా ఇచ్చేలా తీర్చిదిద్దుతామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

నూజివీడు: పల్లెర్లమూడిలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సొంగా రవి (45) ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకుని కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నాడు. రవి శనివారం ఇంట్లో విద్యుత్ బోర్డు ప్లగ్‌లో వైర్లు పెడుతుండగా షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతనిని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.